క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 13న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కేయూ పోలీసు స్టేషన్, పలివేల్పుల, సీఆర్‌ఎఫ్ క్యాంపు, టీబీ ఆస్పత్రి, కనకయ్య హోటల్, మహాత్మా నగర్, విజయగణపతి కాలనీ, వినాయక టెంపుల్ ప్రాంతం, హంటర్‌రోడ్డులోని టెంపుల్ ట్రీ విల్లాస్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 13న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. కాశిబుగ్గ, శాంతినగర్, మదీనా రోడ్డు, రాంకీ, దయానంద కాలనీ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

శ్రీఅరబిందో సొసైటీ మహాసభలు



నయీంనగర్: హనుమకొండ శ్రీఅరబిందో సొసైటీ ఏర్పడి 50 ఏళ్లు అయిన సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు సొసైటీ చైర్మన్ డాక్టర్ బండారి జగదీశ్‌బాబు, కార్యదర్శి వరిగొండ కాంతారావు తెలిపారు. ఈమేరకు హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల సభ్యుల మహాసభలను ఈనెల 14, 15వ తేదీల్లో కాజీపేటలోని ఫాతీమానగర్ బాల వికాస కేంద్రంలో నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కోశాధికారి నాగేశ్వర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

భారత సేవారత్న అవార్డు ప్రదానం



దేశాయిపేట: అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డాక్టర్ ఆడెపు రవీందర్‌కు అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్, సామాజిక న్యాయ సంస్థలు భారత సేవారత్న జాతీయ అవార్డును హనుమకొండలో జరిగిన కార్యక్రమంలో ప్రదానం చేశాయి. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ 30 ఏళ్లగా కళాకారులకు అండగా ఉంటూ, పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, నోట్‌బుక్స్, బ్యాగ్‌లు పంపిణీ చేస్తూ ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు వద్నాల నరేందర్, మార్గం ఎల్లయ్య, కాసం నమఃశివాయ, గడ్డం కేశవమూర్తి, డాక్టర్లు కూరపాటి రమేష్, కటకం నరేందర్, మహేశ్వర్, ఈగ వెంకటేశ్వర్లు, రమేష్, కమలాకర్, రమేష్ పాల్గొన్నారు.

శ్వేతార్కలో సుబ్రహ్మణ్య కల్యాణం



కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం ఆవరణలో వల్లీ, దేవ సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణ వేడుకలను ఆలయ ప్రధాన అర్చకుడు అయిన వోలు సాయికృష్ణ శర్మ గురువారం జరిపించారు. దేవతామూర్తుల కల్యాణ వేడుకలను పురస్కరించుకుని ఉత్సవ విగ్రహాలకు అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు అన్నపూర్ణ భవనంలో మహాన్నదానం చేశారు.

కాజీపేటలో మహాపడి పూజ



కాజీపేట / కాజీపేట రూరల్: కాజీపేట పట్టణంలో గురువారం రాత్రి అయ్యప్ప స్వామి మహా పడిపూజను సీపీ అంబర్ కిశోర్ ఝా ప్రారంభించారు. డేగల శ్రీధర్ గురుస్వామి ఆధ్వర్యంలో తేజావత్ నవీన్ – కవిత దంపతులు చేపట్టిన పడిపూజకు సీపీ హాజరయ్యారు. అయ్యప్ప ఆలయ అర్చకులు ఉడుతల శ్రీనివాస్ శర్మ, జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ పర్యవేక్షణలో స్వామివారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాలు, నదీ జలాలతో అభిషేకం జరిపించారు. అయ్యప్ప స్వామికి సీపీ మహా నైవేద్యం సమర్పించారు. పూజా కార్యక్రమాల్లో బుర్ర జనార్దన్ గౌడ్, పిల్లల కుమారస్వామి, కోటగిరి సంపత్ కుమార్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

విద్యారణ్యపురి: డాక్టర్ కేర్ హోమియోపతి సంస్థ ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల మైదానంలో గురువారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు చేసి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.

మిర్చి రైతుకు ‘నల్లి’ బెడద

- ఎలాంటి మందు పిచికారీ చేసినా కనిపించని ఫలితం
- ఆందోళనలో రైతులు
- పెరుగుతున్న పెట్టుబడి భారం



మండల కేంద్రంలో నల్లి తెగులు సోకిన ఓ రైతుకు చెందిన మిర్చి పంట

నడికూడ : మిర్చి సాగుకు నడికూడ మండలం కేరఫ్‌గా నిలుస్తోంది. ఇక్కడ మిర్చిని వాణిజ్య పంటగా సాగు చేస్తున్నారు. కానీ కొన్నిరోజుల నుంచి మిర్చి తోటకు నల్లి తెగులు నలిపేస్తుంది. ఈ తెగుళ్ల వలన పంటకు తీవ్ర నష్టంతో పాటు రైతులకు పెట్టుబడి ఖర్చు పెరిగి తడిసిమోపేడవుతున్నాయని రైతులు వాపోతున్నారు. నల్లి తెగులు నివారణకు ఎకరానికి 80 వేలు నుంచి లక్ష రూపాయల విలువచేసే మందులను పిచికారి చేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినా ఫలితం ఉండటం లేదని వాపోతున్నారు. ఒక కంపెనీ పురుగుమందు పనిచేయకపోతే వేరే బ్రాండ్ కంపెనీ మందులను పిచికారీ చేసినా ఫలితం లేదని అంటున్నారు. పెట్టుబడి వచ్చే అవకాశం కనిపించడం లేదని మిర్చి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పురుగు మందులు రాత్రిపూట పిచికారీ చేస్తే ఫలితం ఉంటుందని భావించి చీకట్లో సైతం మందులు పిచికారీ చేస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారులు స్పందించి సూచనలు, సలహాలు ఇవ్వాలని మిర్చి రైతులు కోరుతున్నారు.

పెట్టుబడి పెరిగింది



గతేడాది కంటే ఈసారి పెట్టుబడి పెరిగింది. వాతావరణ మార్పులు వలన నల్లి తెగులు సోకడంతో ఎరువులు, రసాయన మందులను పిచికారీ చేసినా ఫలితం లేదు. ఎకరాకు లక్ష వరకు ఖర్చు అవుతుంది. ఈ ఏడాది పెట్టుబడి వచ్చే అవకాశం లేదనిపిస్తోంది.

\- కిషన్ రావు, నర్సక్కపల్లి

నెలరోజుల నుంచి ఇదే పరిస్థితి



నల్లి తెగులు ప్రభావం నెలరోజుల నుంచి అధికంగా ఉంది. నల్లి నివారణకు మార్కెట్లో ఉన్న అన్నిరకాల రసాయన మందులను పిచికారీ చేస్తున్నా ప్రయోజనం కనిపించడం లేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు సలహాలు, సూచనలు ఇవ్వాలి

\- మోకిడి రాజ్‌కుమార్, రైతు, నడికూడ

ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రారంభం



ఐనవోలు : దరఖాస్తు దారుల వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్న జీపీ అధికారులు



వేలేరు : ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ కోమి

ఐనవోలు : మండలంలోని నందనం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే గురువారం ప్రారంభమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం గతంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. కాగా ఆ దరఖాస్తు దారుల ఇంటింటికి వెళ్లి పలు వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. అందులో భాగంగా మండలంలోని నందనం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి తాజుద్దీన్, కారోబార్ అశోక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్, ఇందిరమ్మ గ్రామ కమిటీ సభ్యులు పలువురి ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేశారు. గతంలో గ్రామం నుంచి ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న 968 మంది లిస్టు తమకు అందిందని, వారి పూర్తివివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేయనున్నట్లు కార్యదర్శి తాజుద్దీన్ తెలియజేశారు.

వేలేరులో..

వేలేరు : మండల వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీఓ విమల ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు అధికారులు వెళ్లి వారి వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. మండల కేంద్రంలో జరిగిన సర్వేలో తహసీల్దార్ కోమి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మల్లికార్జున్, యాదగిరి, లక్ష్మణ్ నాయక్, రాణి, మహేశ్వరి, గ్రామపంచాయతీ కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా పాఠశాల

- మద్యం సేవించి.. సీసాలు పగులకొట్టి



పాఠశాలలో పగులగొట్టిన బీరు సీసాలు



పాఠశాల ఆవరణలో పడేసిన బీరు సీసాలు

కమలాపూర్ : పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించే పాఠశాలలో ఆకతాయిలు నీతిమాలిన పనులకు పాల్పడుతూ అపవిత్రం చేస్తున్నారు. మండలంలోని గూడూరు జెడ్పీ హైస్కూల్ పాఠశాల మందుబాబులకు అడ్డాగా మారింది. పాఠశాల చుట్టు ప్రహరీ లేకపోవడంతో చీకటి పడితే చాలు మందుబాబులు పాఠశాల ఆవరణలోకి ప్రవేశించి వరండాల్లో, మైదానంలో మద్యం సేవించి వీరంగం సృష్టిస్తున్నారు. మద్యం సేవించిన అనంతరం మద్యం మత్తులో ఖాళీ సీసాలు పగులగొట్టి బీభత్సం సృష్టిస్తున్నారు. మరునాడు పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు, విద్యార్థులకు మందుబాబులు తాగి పడేసిన ఖాళీ సీసాలతో పాటు పగుల గొట్టిన సీసాల గాజు పెంకులు దర్శనమిస్తున్నాయి. పాఠశాల చుట్టు ప్రహరీ నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యా శాఖ అధికారులు, పోలీసులు స్పందించి ఆకతాయిల ఆగడాలను అరికట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా పాఠశాల ఆవరణలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని విద్యా శాఖ అధికారులతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు హెచ్‌ఎం సత్యనారాయణ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఫణిచంద్ర

శాయంపేట : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకొని మండలంలోని వివిధ రాజకీయ పార్టీ నాయకులతో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ ఫణిచంద్ర పోలింగ్ స్టేషన్ ఏర్పాటుపై అవగాహన సదస్సు నిర్వహించారు. 24 గ్రామపంచాయతీలకు 212 వార్డులు ఉండగా జనాభా ఆధారంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల డ్రాఫ్ట్ పబ్లికేషన్‌ను విడుదల చేశామన్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సులో ఎంపీఓ రంజిత్‌కుమార్, నాయకులు కోమటి రాజశేఖర్, వైనాల కుమారస్వామి, వలిహైదర్, మోహన్ పాల్గొన్నారు.

రిలే నిరాహారదీక్షలను జయప్రదం చేయాలి

శాయంపేట : మండల కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టనున్న రిలే నిరాహారదీక్షను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మాల్యాల అమరేందర్ పిలుపునిచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, అణగారిన వర్గాల ప్రజలకు మౌలిక వసతులైన విద్య, వైద్యం, ఉపాధి, ఇళ్లు, భూమి, ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాజ్యాంగ బద్ధమైన హక్కులను కల్పించాలనే డిమాండ్‌లో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజలు, మేధావులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. హక్కుల సాధనకు ఉద్యమించాల్సిన సమయం వచ్చిందన్నారు.

బావి వద్దకు ‘మిషన్’ అధికారులు

- నీరు రాకుండా నాన్ రిటర్న్‌వాల్వ్ బిగిస్తాం

సాక్షి ఎఫెక్ట్..



మంచినీటి బావిని పరిశీలిస్తున్న అధికారులు

శాయంపేట : మండల కేంద్రంలోని మంచినీటి బావిలోకి మిషన్ భగీరథ నీరు రివర్స్ పంపింగ్ అవుతున్న విషయం తెలిసిందే. కాగా గురువారం సాక్షి దినపత్రికలో ‘బావిలోకి మిషన్ భగీరథ నీరు’ కథనం ప్రచురితం అయ్యింది. దీంతో స్పందించిన పరకాల సబ్ డివిజన్ మిషన్ భగీరథ ఇంట్రా డీఈఈ మధుకుమార్, ఇంట్రా ఏఈ వెంకటేశ్ బావిని పరిశీలించారు. భగీరథ నీరు మంచినీటి బావిలోకి రాకుండా నాన్ రిటర్న్‌వాల్వ్‌ను బిగిస్తామని తెలిపారు. వారంరోజుల్లో బీసీ కాలనీలోని వాటర్‌ట్యాంకు పంపింగ్ అయ్యేలా చర్యలు చేపడతామని, బావిలోని నీటిని పరకాల వాటర్ టెస్టింగ్ ల్యాబ్‌కు పంపించనున్నట్లు తెలిపారు.

సంక్షిప్తంగా

అగ్ని ప్రమాదంలో మహిళకు గాయాలు

శాయంపేట : చలిమంట కాగుతుండగా ప్రమాదవశాత్తు మహిళకు మంటలు అంటుకున్నాయి. ఈ సంఘటన మండలంలోని పోచారం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెంది కొయ్యాడ ప్రవళిక ఉదయం చలి మంటలు కాగుతుండగా ప్రమాదవశాత్తు చీర అంటుకుంది. ఈ క్రమంలో శరీర వెనుకభాగం కాలిపోయింది. అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని ఈఆర్‌సీపీ డాక్టర్ మౌనిక సలహా మేరకు ఈఎంటీ రాజు, పైలెట్ తిరుపతి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎంకు ఆసుపత్రికి తరలించారు.

గుట్కా, అంబర్ విక్రయిస్తే కేసులు

- ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ

కమలాపూర్ : మండల కేంద్రంలోని కిరాణా దుకాణాల్లో విక్రయిస్తున్న ప్రభుత్వ నిషేధిత గుట్కా, అంబర్, పాన్ మసాలా ప్యాకెట్లను పట్టుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని వివిధ కిరాణా దుకాణాల్లో గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు మండల కేంద్రంలోని పలు కిరాణాలపై దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో శ్రీనివాస్, సంపత్, శ్రీనివాస్ అనే ముగ్గురికి చెందిన కిరాణా దుకాణాల్లో రూ.6,200 విలువచేసే గుట్కా, అంబర్, పాన్‌మసాలా ప్యాకెట్లను సీజ్ చేసి, అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

నియామకం



శాయంపేట : మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీపీ బాసాని చంద్రప్రకాశ్‌ను తెలంగాణ రాష్ట్ర మినియం వెజెస్ అడ్వైజరీ బోర్డ్ సభ్యుడిగా నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపాల్ సెక్రటరీ సంజయ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో విడుదల చేశారు. 1982 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీలో చేరి, 1992లో పరకాల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, 1995 శాయంపేట గ్రామ సర్పంచ్‌గా, 2001లో ఎంపీపీగా, చేనేత సొసైటీ చైర్మన్‌గా పని చేశారు. 2018లో ఎంపీటీసీగా సేవలందించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషిని గుర్తించి ఈ అవకాశం కల్పించినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణరావు, చైర్మన్ జనక్ ప్రసాద్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్సీ కవితకు క్షమాపణ చెప్పాలి



శాయంపేట : ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, ఎన్నం శ్రీనివాసరెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని భారత జాగృతి యువత రాష్ట్ర కార్యదర్శి అమ్మ అశోక్ డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో గురువారం ఆయన విలేకరుతో మాట్లాడారు. ఎమ్మెల్సీ కవితను మహిళా అని చూడకుండా అసభ్య పదజాలంతో కించపరుస్తూ మాట్లాడడం సరికాదన్నారు.

దేశం గర్వించే క్రీడాకారులుగా ఎదగాలి

- ఎంపీడీఓ గుండె బాబు



కమలాపూర్ : విజేతలకు పతకాలు అందజేసిన ఎంపీడీఓ బాబు, తదితరులు

కమలాపూర్ : గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటుతూ దేశం గర్వించే క్రీడాకారులుగా ఎదగాలని ఎంపీడీఓ గుండె బాబు సూచించారు. స్థానిక ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న సీఎం కప్ మండలస్థాయి క్రీడా పోటీలు గురువారంతో ముగిశాయి. సాయంత్రం ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదానం కార్యక్రమంలో మండలస్థాయిలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీరాణి, వైస్ చైర్మన్ దేశిని ఐలయ్యగౌడ్, ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ, ఎంజేపీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కవితారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలో నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్‌రావు గురువారం బహుమతులు, ప్రశంస పత్రాలు అందించారు. కబడ్డీ ప్రథమస్థానంలో గట్లనర్సింగాపూర్ బాలుర జట్టు, భీమదేవరపల్లి బాలకల జట్టు. ద్వితీయస్థానంలో కొత్తకొండ బాలుర జట్టు, కొత్తపల్లి బాలకల జట్టు, ఖోఖో పోటీల్లో ప్రథమస్థానంలో కొప్పూర్ బాలుర జట్టు, బాలికల జట్టు, ద్వితీయస్థానంలో వంగర గురుకులం జట్టు, సాయినగర్ కొత్తపల్లి బాలుర జట్టు, ఎర్రబెల్లి బాలకల జట్టు, వాలీబాల్ క్రీడల్లో ప్రథమస్థానంలో ముల్కనూరు బాలుర జట్టు, భీమదేవరపల్లి బాలికల జట్టు, ద్వితీయస్థానంలో రత్నగిరి బాలుర జట్టు, కొత్తకొండ బాలికల జట్టు విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వీరేశం, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, మండల ఇన్‌చార్జ్ విద్యాధికారి సునీతారాణి, ఎస్సై సాయిబాబు, నాయకులు కొలుగూరి రాజు, చిట్టంపల్లి అయిలయ్య, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.



పరకాల : విజేతలతో ఎంపీడీఓ, తదితరులు



ఎల్కతుర్తిలో..

పరకాల : గ్రామీణ ప్రాంత యువత గ్రామీణస్థాయి క్రీడాల నుంచి రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణించే విధంగా ఎదగాలని పరకాల ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం కప్ క్రీడాల్లో జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఆంజనేయులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత యువతలో క్రీడా నైపుణ్యాన్ని గుర్తించి వారిని మరింత ప్రోత్సహించాలనే ఆలోచనతో గ్రామీణస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి రమాదేవి, నోడల్ అధికారి నామాని సాంబయ్య, ప్రధానోపాధ్యాయులు మధు, సురేందర్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ కవిత పాల్గొన్నారు.

వేప కలప తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత



ఫారెస్ట్ అధికారులు పట్టుకున్న ట్రాక్టర్

శాయంపేట : అక్రమంగా వేప కలపను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మైసయ్య తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. బుధవారం రాత్రి బస్టాండ్ సెంటర్‌లో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తున్నారు. వేప కలపను ట్రాక్టర్‌లో అక్రమంగా పరకాలకు తరలిస్తుండగా గమనించిన ట్రాక్టర్ డ్రైవర్ తౌటం రాజు ట్రాక్టర్‌ను ఓ గల్లీలో నిల్వచేసి ఉంచాడు. విషయం తెలుసుకున్న ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ సభ్యుడు మారెపల్లి సునీల్ గమనించి డీఎఫ్ లావణ్యకు, స్థానిక ఎస్సై ప్రమోద్‌కుమార్‌కు సమాచారం అందించాడు. పోలీసులు ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ రాజుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కలప విలువ సుమారు రూ.16 వేలు ఉంటుందని పేర్కొన్నారు. అనుమతులు లేకుండా కలప రవాణా, విక్రయాలు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అక్రమంగా కలప రావాణా చేస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పైపులైన్ లీకేజీ.. వృథా అవుతున్న తాగునీరు



\- మడికొండ రోడ్డుపై ప్రవహిస్తున్న తాగునీరు

గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్‌లోని సిరి వాటర్ ప్లాంట్ వీధిలో పైపులైన్ లీకేజీతో పదిరోజులుగా తాగునీరు వృథాగా పోతోంది. ఈక్రమంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లీకేజీలను అరికట్టాలని కోరినా మున్సిపల్ సిబ్బంది పట్టించుకోవడం లేదు. మెయిన్ లైన్ కావడంతో గంటల తరబడి తాగునీరు రోడ్డు పాలవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లక్ష్యం నిర్దేశించుకుని చదువుకోవాలి



కాజీపేట: విద్యార్థులు చిన్న వయస్సు నుంచే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని మంచిగా చదువుకోవాలని పాఠశాల పూర్వ విద్యార్థి నిఖిత బోగా (ఐఎఫ్ఎస్) అన్నారు. కాజీపేట పట్టణంలోని సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం రాత్రి 60వ వార్షికోత్సవాలను ఆమె ప్రారంభించారు. బాలబాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ వేమూరి అభిజ్ఞ, ప్రిన్సిపాల్ జులియ, కరస్పాండెంట్ సుధారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.